సాక్షి విశాఖపట్నం

బుధవారం। 20। నవంబర్। 2024



సృజన వెలికితీసేందుకే ..

సెయింట్ ఆంథోనీ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విశాఖ బాలోత్సవం వేడుకగా ప్రారంభమైంది.

8లో



'ఆన్‌లైన్'.. భవితకు వెలుగు

ఏయూ దూర విద్య విభాగం ద్వారా మూడేళ్ల క్రితం అందుబాటులోకి వచ్చిన ఆన్‌లైన్ డిగ్రీ, పీజీ కోర్సులకు స్పందన లభిస్తోంది.

8లో



సకాలంలో క్యాన్సర్ సర్వే

జిల్లాలో క్యాన్సర్ సర్వేను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేందిర ప్రసాద్ సూచించారు.

8లో

న్యూస్‌రీల్

వచ్చే నెల 2 నుంచి శ్రీ నృసింహ దీక్షలు



సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఈ ఏడాది శ్రీ నృసింహ దీక్షలు డిసెంబర్ 2 నుంచి ప్రారంభమవుతాయని దేవస్థానం ఈవో వి.త్రినాథరావు మంగళవారం తెలిపారు. దేవస్థానం వైదికులు నిర్ణయించిన ప్రకారం 2 నుంచి మండల దీక్ష, 12 నుంచి 32 రోజుల దీక్ష ప్రారంభంకానున్నట్లు పేర్కొన్నారు. ఆయా రోజుల్లో దీక్షాధారులకు సింహగిరిపై దేవస్థానం తరపున మాలధారణ చేసి, తులసి మాల, స్వామివారి ప్రతిమ ఉచితంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. వచ్చే ఏడాది జనవరి 12న దీక్షలు విరమించాల్సి ఉంటుందన్నారు. దీక్ష చేయాలనుకునేవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

14, 15 తేదీల్లో 'కలెక్టర్ కప్' క్రీడా పోటీలు



క్రీడల నిర్వహణపై సమీక్షలో పాల్గొన్న వివిధ శాఖల అధికారులు

మహారాణిపేట: సంక్షేమ శాఖల వసతి గృహాల విద్యార్థులకు కలెక్టర్ కప్ పేరిట క్రీడా పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు సాంఘిక సంక్షేమశాఖ కార్యాలయంలో ఆ శాఖ డీడీ కె.రామారావు ఆధ్వర్యంలో మంగళవారం సాంఘిక, గిరిజన, వెనుకబడిన తరగతుల అధికారులు, క్రీడా శాఖ అధికారులతో క్రీడల నిర్వహణపై సమీక్ష జరిగింది. డిసెంబర్ 14, 15వ తేదీల్లో జిల్లాలోని సుమారు 6,500 మంది విద్యార్థులకు కొమ్మాదిలోని క్రీడా మైదానంలో పోటీలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. బీసీ సంక్షేమ శాఖ శ్రీదేవి, గిరిజన సంక్షేమ శాఖ అఖిల, జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి జూన్ గాలియట్, సహాయ సంక్షేమ అధికారులు, వసతి గృహాల అధికారులు పాల్గొన్నారు.

తిరుమలనగర్‌కు మరో అవార్డు



అవార్డు అందుకుంటున్న తిరుమలనగర్ అసోసియేషన్ ప్రతినిధులు

అగనంపూడి: తిరుమలనగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మరో ప్రతిష్టాత్మక అవార్డు అందుకుంది. గచ్చిబౌలీలోని స్టాఫ్ కాలేజీ ఆవరణలో ఇంజినీర్స్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా 11వ జాతీయ సమావేశం జరిగింది. ఇందులో భాగంగా తిరుమలనగర్‌కు జాతీయ బెస్ట్ రెసిడెన్షియల్ అసోసియేషన్(ఆర్‌డబ్ల్యూఏ) అవార్డు అందించారు. తెలంగాణ రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎన్‌సీఆర్‌డబ్ల్యూ అధ్యక్షుడు డాక్టర్ రావు చెలికాని, కన్వీనర్ కల్నల్ త్యాగి, ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ఆర్ మూర్తి చేతులమీదుగా అసోసియేషన్ ప్రతినిధులు నాగభూషణం, విశ్వేశ్వరరావు ఈ అవార్డును అందుకున్నారు. పరమానందం, అప్పలనాయుడు, తిరుపతి నాయుడు, ఆంధ్రప్రదేశ్ సలహాదారు రాజన్ చిబ్బర్, ఏపీ పేర్వాస్ కార్యదర్శి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వ జలశక్తి అవార్డును తిరుమలనగర్ అసోసియేషన్ అందుకున్న సంగతి తెలిసిందే.

పీసీ మహల్‌నోబిస్ అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

ఎంవీపీకాలనీ: ప్రపంచ ప్రఖ్యాత గణాంకవేత్త ఆచార్య పీసీ మహల్‌నోబిస్ పేరిట అందించే అవార్డుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సెట్విన్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి ఎం.సత్యపద్మ తెలిపారు. ఈ అవార్డు స్టాటస్టిక్స్‌లో విస్తృత పరిశోధనలు, గణాంక పద్ధతులను ప్రోత్సహించిన వారికి ఈ అవార్డు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవార్డు ద్వారా రూ.10 వేల యూఎస్ డాలర్స్ నగదు బహుమతితో పాటు ప్రశంసా పత్రం, మెమొంటో అందిస్తామన్నారు. https://www.isi-web. org పోర్టల్ ద్వారా డిసెంబర్ 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఎల్‌టీటీ-భువనేశ్వర్ వన్‌వే స్పెషల్

తాటిచెట్లపాలెం: లోకమాన్య తిలక్ టెర్మినస్-భువనేశ్వర్ మధ్య విశాఖ మీదుగా వన్ వే స్పెషల్ రైలు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. లోకమాన్యతిలక్ టెర్మినస్-భువనేశ్వర్(01097) వన్ వే స్పెషల్ మంగళవారం అర్ధరాత్రి తర్వాత(బుధవారం) 12.45 గంటలకు లోకమాన్య తిలక్ టెర్మినస్‌లో బయలుదేరుతుంది. గురువారం తెల్లవారు 1.50 గంటలకు విశాఖ చేరుకుని, అదే రోజు ఉదయం 10.15 గంటలకు భువనేశ్వర్ వెళ్తుంది.

అటవీ విభాగంలో అక్రమార్కులు



సంస్థలో మస్తర్లు వేయించి సొంత పనులకు కార్మికుల తరలింపు.. సొసైటీల పేరుతో చేసే పనుల బిల్లులు సొంత ఖాతాల్లో జమ.. అధికారులే బినామీల పేరుతో కాంట్రాక్టర్ అవతారం.. కుంటి సాకులతో కార్మికుల పొట్టకొట్టి కొత్త వారి నియామకం.. ఈ ప్రక్రియలో వారి నుంచి భారీగా వసూలు.. ఇదీ విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (వీఎంఆర్‌డీఏ)లో అటవీ విభాగం అధికారుల తంతు. –విశాఖ సిటీ

కార్మికుల పొట్టగొడుతున్న వైనం ▪ నిర్ధాక్షణ్యంగా 10 మంది కార్మికుల తొలగింపు ▪ వారి స్థానంలో కొత్త వారి నియామకం

- నియామక ప్రక్రియలో రూ. లక్షలు చేతులు మారినట్లు ఆరోపణలు
- సొసైటీ పేరుతో బిల్లులూ అధికారుల ఖాతాల్లోకే..
- సొంత పనులకు వీఎంఆర్‌డీఏ కార్మికుల వినియోగం

విశాఖ సుందరీకరణ పనులు వీఎంఆర్‌డీఏ అటవీ విభాగంలో కొంత మందికి కాసుల వర్షం కురిపిస్తున్నాయి. కాంట్రాక్టు పనుల నుంచి కార్మికుల వేతనాల వరకు అన్నింటిలోను చేతివాటం ప్రదర్శిస్తున్నారన్నది బహిరంగ రహస్యమే. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం ఈ విభాగంలో కొందరికి వరంగా మారుతోంది.

సొంత పనులకు సంస్థ కార్మికులు



వీఎంఆర్‌డీఏ పార్కులు, పర్యాటక ప్రాంతాల్లో పనిచేయాల్సిన కార్మికులను అటవీ విభాగం అధికారులు కొందరు వారి సొంత పనులకు వినియోగించుకోవడం గమనార్హం. ఒక అధికారి విజయనగరంలో ఉన్న తన సొంత వ్యవసాయ భూమిలో పనులకు నెలల తరబడి సంస్థ కార్మికులనే వినియోగించారు. ఈ విషయాన్ని 'సాక్షి' వెలుగులోకి తీసుకొచ్చిన రెండు రోజుల్లోనే సదరు అధికారిపై బదిలీ వేటు పడింది. అలాగే ఆ కింది స్థాయి అధికారులు, సిబ్బంది సైతం అదే తరహాలో వ్యవహరిస్తున్నారు. ఒక అధికారి నగరంలో హెల్త్ సిటీలో ఉన్న ఒక ప్రైవేటు ఆస్పత్రిలో ప్లాంటేషన్ పనులను ఒప్పుకున్నారు. ఈ పనులను గత కొంత కాలంగా రహస్యంగా చేస్తున్నారు. వీఎంఆర్‌డీఏ కార్మికులతోనే ఈ పనులను చేయిస్తుండడం విశేషం. అలాగే చినముషిడివాడలో కూడా మరో ప్రైవేటు పనులకు సంస్థ కార్మికులనే వినియోగిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో కూడా అనేక సందర్భాల్లో సంస్థలో కాంట్రాక్టర్ల పనులను వీరితో చేయించిన సందర్భాలు వెలుగుచూశాయి. కొన్ని చోట్ల సిబ్బందే కాంట్రాక్టర్ల అవతారమెత్తారన్న వార్తలు వినిపిస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో సుందరీకరణ పనులను వీరి కుటుంబ సభ్యుల పేరు మీద కేటాయించి సంస్థ కార్మికులతోనే చేయిస్తూ రెండు చేతులా సంపాదిస్తున్నారన్న గుసగుసలు ఉన్నాయి.

కార్మికుల పొట్ట కొట్టి..



వీఎంఆర్‌డీఏ ఆధీనంలో పలు పర్యాటక, సందర్శన పార్కులు ఉన్నాయి. ప్రధానంగా కైలాసగిరి, తెన్నేటి పార్కు, వుడా పార్కు, వైఎస్సార్ సెంట్రల్ పార్క్ ఇలా పర్యాటక ప్రదేశాల్లో రోజువారి వేతనం కింద కార్మికులను నియమించారు. వీరికి ఒక్కొక్కరికీ రోజుకు రూ.560 చొప్పున వేతనం అందిస్తున్నారు. ఇదిలా ఉంటే కుంటి సాకులు చెప్పి కొద్ది నెలల క్రితం 10 మంది కార్మికులను తొలగించి వారి పొట్టకొట్టారు. వీరంతా ఏళ్ల తరబడి ఆ పనులు చేస్తున్నప్పటికీ.. వయసు, ఇతర చిన్న చిన్న కారణాలు చూపించి తీసేశారు. కొన్ని చోట్ల మాత్రం అధికారులకు చెందిన 60 ఏళ్లు పైబడిన, అసలు పనులు చేయలేని స్థితిలో ఉన్న వారిని చూసీచూడనట్లు వదిలేశారని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై కార్మికులు అటవీ విభాగం ఉన్నతాధికారులను కలిసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. వీఎంఆర్‌డీఏ కమిషనర్‌ను కలవడానికి ప్రయత్నించినప్పటికీ.. అక్కడి సిబ్బంది ఆ అవకాశం ఇవ్వడం లేదని వాపోతున్నారు.

నియామకాల పేరుతో వసూళ్లు



వీఎంఆర్‌డీఏ పార్కుల్లో తొలగించిన కార్మికుల స్థానంలో కొత్త వారిని నియమించే విషయంలో అటవీ విభాగం అధికారులు భారీగా వసూళ్లకు తెరతీశారన్న వార్తలు వినిపిస్తున్నాయి. రెండు నెలల క్రితమే కైలాసగిరిపై పనులకు 10 మందిని, వీఎంఆర్‌డీఏ పార్కులో ఇద్దరిని, సెంట్రల్ పార్కు, తెన్నేటి పార్కులలో ఒక్కొక్కరి చొప్పున రోజు వారి వేతనం ప్రకారం నియమించారు. ఈ నియామకాల్లో ఒక్కొక్కరి నుంచి రూ.లక్ష నుంచి రూ.1.5 లక్షలు వరకు వసూలు చేశారన్న వాదనలు ఉన్నాయి. రోజు వారి వేతనమైనప్పటికీ వీఎంఆర్‌డీఏ పార్కులో నిత్యం పనులు ఉంటాయి. నెలకు కనీసం రూ.15 వేలు వరకు వీరికి వేతనంగా లభిస్తుంది. దీంతో ఈ పనులు చేసేందుకు కార్మికులు సైతం ఆసక్తి చూపిస్తుంటారు. ఈ అవకాశాన్ని కొంత మంది అధికారులు తమకు అనుకూలంగా మలుచుకుంటున్నారు. కార్మికుల నుంచి సైతం విడిచిపెట్టకుండా దండుకుంటున్నారు. అలాగే గార్డెన్ సూపర్‌వైజర్లుగా విద్యార్హతలు ఉన్నవారినే తీసుకోవాలన్న నిబంధన ప్రకారం కొంత మందిని తొలగించి, వారి స్థానంలో ఎటువంటి విద్యార్హతలు లేకపోయినా ఒకరిద్దరిని నియమించారన్న ఆరోపణలు ఉన్నాయి. అదే విధంగా అటవీ విభాగం పరిధిలో ఏడు సొసైటీలు ఉన్నాయి. సంస్థకు చెందిన చిన్న చిన్న పనులను ఈ సొసైటీ ద్వారా చేస్తుంటారు. ఆ పనుల విషయంలో కూడా ఈ అధికారులు మాయ చేసి బిల్లులను తమ బినామీ ఖాతాల్లోకి జమ చేసుకుంటున్నారన్న టాక్ వినిపిస్తోంది. ఉన్నతాధికారులు సైతం కొంత మంది కింది స్థాయి సిబ్బంది చెప్పిన విధంగా వ్యవహరిస్తూ క్షేత్ర స్థాయిలో పరిస్థితులపై దృష్టి పెట్టకపోవడం విశేషం.

72 కేసుల ఛేదన.. రూ.88.52 లక్షల రికవరీ

- అక్టోబర్‌లో 116 చోరీ కేసుల నమోదు
- 102 మంది నిందితుల అరెస్ట్
- 742.97 గ్రాముల బంగారం, 326.48 గ్రాముల వెండి రికవరీ
- 20 బైక్‌లు, 3 ఆటోలు, ఒక ట్యాంకర్ స్వాధీనం
- సీపీ శంఖబ్రత బాగ్చి



రికవరీ చేసిన బంగారం, వెండి ఆభరణాలను పరిశీలిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి





రికవరీ చేసిన మొబైల్స్, ఆటోలు, బైకులు

విశాఖ సిటీ: నగరంలో సమర్థవంతమైన పోలీసింగ్, సాంకేతికత సహాయంతో భారీగా చోరీ కేసులను ఛేదించినట్లు పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. పోలీస్ సమావేశ మందిరంలో మంగళవారం రికవరీ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ అక్టోబర్‌లో 116 చోరీ కేసులు నమోదయ్యాయని.. ఇందులో 72 కేసులను ఛేదించి 102 మంది నిందితులను అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. వీరి నుంచి రూ.45,77,520 విలువైన 742.97 గ్రాముల బంగారం, 326.48 గ్రాముల వెండి ఆభరణాలు, రూ.2,88,370 నగదుతో పాటు 20 ద్విచక్ర వాహనాలు, 3 ఆటోలు, ట్యాంకర్, ల్యాప్‌టాప్, 8 బ్యాటరీలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే రూ.42.75 లక్షలు విలువైన 285 మొబైళ్లను రికవరీ చేశామన్నారు. నేరాల నియంత్రణ కోసం అక్టోబర్‌లో నగరంలో కొత్తగా 294 సీసీ కెమెరాలు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. అలాగే ప్రత్యేక పోలీసు బృందాలు ఏర్పాటు చేసి దొంగతనాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలలో నిఘా పెట్టినట్లు వివరించారు. అనంతరం రికవరీ చేసిన రూ.88,52,520 విలువైన బంగారం, వెండి, వాహనాలు, మొబైళ్లను బాధితులకు సీపీ చేతుల మీదుగా అందజేశారు. సమావేశంలో డీసీపీ(క్రైం) లతా మాధురి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జనవరి 1 నుంచి ప్లాస్టిక్ నిషేధం

- రూ.500 కోట్లతో ఐదేళ్లలో రోడ్ల అభివృద్ధి
- జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ వెల్లడి



దాబాగార్డెన్స్: వచ్చే జనవరి ఒకటో తేదీ నుంచి నగరంలో ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధిస్తున్నట్లు జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ స్పష్టం చేశారు. ఇప్పటికే దుకాణదారులతో మాట్లాడామని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని వారికి సూచించినట్లు చెప్పారు. ప్లాస్టిక్ నిషేధంపై నగర పౌరులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జీవీఎంసీలోని తన చాంబర్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రూ.500 కోట్లతో ఐదేళ్లలో నగర పరిధిలో రోడ్లన్నీ పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తామన్నారు. ప్రతి జంక్షన్‌లో సీసీ కెమెరాలు, వీధి దీపాలు పక్కాగా వెలిగేలా, రోడ్లకిరువైపులా గ్రీనరీ ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. హైదరాబాద్, తిరువనంతపురం తరహాలో ఈ ప్రాజెక్ట్ చేపడతామని, వచ్చే ఏడాది ఏప్రిల్ నుంచి ఈ పనులు ప్రారంభిస్తామని వెల్లడించారు. జీవీఎంసీ పరిధిలో ఎంపిక చేసిన 15 రోడ్ల మీదుగా హైవేకు సులువుగా వెళ్లేలా ప్రణాళిక రూపొందించినట్లు వివరించారు.

రూ.295 కోట్లతో తాగునీటి ప్రాజెక్టు

జీవీఎంసీ పరిధిలో ప్రతి రోజూ 460 ఎంఎల్‌డీ నీరు అవసరం కాగా.. పంపింగ్‌లో లోపం కారణంగా 400 ఎంఎల్‌డీ నీటినే సరఫరా చేస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. ఇందులో 90 ఎంఎల్‌డీ నీటిని పరిశ్రమలకు, 310 ఎంఎల్‌డీ నీటిని ప్రజావసరాలకు వినియోగిస్తున్నామని వెల్లడించారు. 68 శాతం నీరు ఏలేరు కాలువ నుంచి, 32 శాతం మిగిలిన రిజర్వాయర్ల నుంచి వస్తోందన్నారు. రూ.295 కోట్లతో కొత్తగా తాగునీటి ప్రాజెక్ట్ చేపడుతున్నట్లు వెల్లడించారు. కణితి రిజర్వాయర్ నుంచి నరవ కొండకు, అక్కడి నుంచి నేరుగా ముడసర్లోవకు వెళ్లేటట్లు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఇందుకు సంబంధించి నిధుల కోసం ఐఎఫ్ఎస్‌తో చర్చించినట్లు వెల్లడించారు. జీవీఎంసీ పరిధిలో 5.79 లక్షల అసెస్‌మెంట్స్ ఉన్నప్పటికీ 3.5 లక్షల అసెస్‌మెంట్స్‌కే మంచినీటి కనెక్షన్లు ఉన్నాయని, 95 వేల అసెస్‌మెంట్స్ వారు కనెక్షన్లు వద్దంటున్నారని చెప్పారు. పాత పైపులు మరమ్మతులు చేపట్టేందుకు అసెస్‌మెంట్‌దారులు ముందుకు రావాలన్నారు. మురళీనగర్ తదితర ప్రాంతాల్లో 24 గంటల మంచినీటి సరఫరా చేస్తున్నామని, అన్ని జోన్లలో 24/7 మంచి నీరు సరఫరా చేయాలంటే పెద్ద మొత్తంలో ఖర్చవుతుందన్నారు. వచ్చే ఏడాది కాలంలో పబ్లిక్ కుళాయిలను తొలగిస్తామన్నారు.

రూ.550 కోట్లతో యూజీడీ ప్రాజెక్టు..

జీవీఎంసీ పరిధి జోన్-3, 4, 5లో ఇప్పటికే భూగర్భ డ్రైనేజీ అమలవుతోందని, జోన్-6, 8లో కొంత మేర పనులు జరిగాయన్నారు. జోన్-1 భీమిలి, జోన్-7 అనకాపల్లిని మినహాయించి జోన్-2లో భూగర్భ డ్రైనేజీ పనులు త్వరితగతిన చేపట్టేందుకు ఇప్పటికే డీపీఆర్ సిద్ధం చేశామన్నారు. రూ.550 కోట్లతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టుకు జీవీఎంసీ రూ.9 కోట్లు, అమృత పథకం కింద రూ.45 కోట్లు రానుండగా మిగిలిన మొత్తాన్ని ఐఎఫ్ఎస్‌సీ అందజేస్తుందన్నారు. భూగర్భ డ్రైనేజీ అమలవుతున్న ప్రాంతాల్లో 45 శాతం కనెక్షన్లు తీసుకోలేదని, వారందరూ త్వరలో కనెక్షన్లు తీసుకోవాలని సూచించారు. అప్పుఘర్ వద్ద ఉన్న ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను ఆధునికీకరిస్తామన్నారు. సిటీ పరిధిలో 149 చీకటి ప్రాంతాలుగా గుర్తించామని, ఆయా ప్రాంతాల్లో పోలీస్ శాఖ నైట్ పెట్రోలింగ్‌తో పాటు నిఘా ఏర్పాటు చేసిందన్నారు. జీవీఎంసీ పరిధిలో 1.18 లక్షల వీధిలైట్లు ఉన్నాయని, చాలా చోట్ల వెలగడం లేదన్నారు. క్షేత్ర స్థాయి పరిశీలనలో ఈ విషయాన్ని గమనించానని, దీపాలన్నీ పక్కాగా వెలిగేలా చర్యలు చేపట్టినట్లు వివరించారు.

జిల్లా సుస్థిర అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక

- బహిరంగ మల, మూత్ర విసర్జన నిర్మూలనకు సహకరించండి
- ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవంలో కలెక్టర్ హరేందిర ప్రసాద్



ఆనందపురం జెడ్పీ హైస్కూల్‌లో మొక్క నాటి నీరు పోస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్



వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలెక్టర్ హరేందిర ప్రసాద్

మధురవాడ: జిల్లా సుస్థిర అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ హరేందిర ప్రసాద్ తెలిపారు. ఇందుకోసం జిల్లాలోని 79 గ్రామ పంచాయతీల్లో గ్రామం వారీగా అంచనాలు సిద్ధం చేస్తామన్నారు. ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకప్పుడు మరుగుదొడ్ల గురించి మాట్లాడాలంటే అందరూ సిగ్గు పడే పరిస్థితి ఉండేదన్నారు. 2014లో ప్రధాని మోదీ ప్రారంభించిన స్వచ్ఛభారత్ మిషన్ వల్ల 99 శాతం బహిరంగ మల విసర్జనను అరికట్టామని, మిగిలిన ఒక శాతం కూడా అరికట్టాల్సి ఉందన్నారు. బహిరంగ మల విసర్జన వల్ల అనేక వ్యాధులు సంభవిస్తాయని హెచ్చరించారు. శత శాతం బహిరంగ మల, మూత్ర విసర్జన నిర్మూలన, సురక్షిత తాగునీటి సరఫరా సాధించడమే లక్ష్యమని, ఇది ఒక్క ప్రభుత్వ యంత్రాంగం కృషి చేస్తేనే సరిపోదన్నారు. ప్రజా ప్రతినిధులు, ప్రజలు, యువత, విద్యార్థులు దీని ప్రాధాన్యం తెలుసుకుని భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కేవలం సామాజిక మరుగుదొడ్ల నిర్మాణం మాత్రమే కాకుండా ఆస్పత్రులు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో మరుగుదొడ్లను ఉపయోగంలోకి తీసుకొస్తామన్నారు. ప్రతి విద్యార్థి కూడా మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యతను తీసుకోవాలన్నారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేసి, పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. పారిశుధ్య కార్మికులను సత్కరించారు. డీఈవో ప్రేమ్‌కుమార్, జెడ్పీ సీఈవో సత్యనారాయణమూర్తి, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసరావు, ఎంపీడీవో జానకి, తహసీల్దార్ శ్యాం ప్రసాద్, హెచ్ఎం కె.రామకృష్ణ పట్నాయక్, ఎంఈవోలు రవీంద్రబాబు, గంగరాజు, సర్పంచ్ చందక లక్ష్మి, ఉప సర్పంచ్ బంటుపల్లి రమణమ్మ, ఎంపీటీసీలు బంటుపల్లి అప్పలస్వామి, కొట్యాడ రమాదేవి పాల్గొన్నారు.

మైదానం అభివృద్ధికి పూర్వ విద్యార్థుల వినతి

ఆనందపురం జెడ్పీ హైస్కూల్ గ్రౌండ్ అభివృద్ధికి చర్యలు చేపట్టాలని పూర్వ విద్యార్థులు కలెక్టర్ హరేందిర ప్రసాద్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఇక్కడ పాఠశాలతో పాటు ఓ వసతి గృహం ఉందని, పిల్లలతో పాటు నిత్యం వ్యాయామం చేసే వందలాది మందికి ఇది ఉపయుక్తంగా నిలుస్తుందన్నారు. మైదానాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి వ్యాయామ పరికరాలు ఏర్పాటు చేయాలని కోరారు. దీనికి కలెక్టర్ స్పందించి ఎస్ఆర్ఈజీఎస్ ద్వారా పనులు చేపట్టాలని ఎంపీడీవోను ఆదేశించారు.

విచారణాధికారులకు విజిలెన్స్ లేఖ

ఈవో రామచంద్రమోహన్‌ను కాపాడేందుకేనా?

- సింహాచలం భూముల అక్రమాలపై గతంలోనే విచారణ
- తాజాగా సందేహాల నివృత్తి పేరిట విచారణాధికారులకు పిలుపు

మహారాణిపేట: సింహాచలం భూములను నిషేధిత జాబితా నుంచి నిబంధనలకు విరుద్ధంగా తొలగించారన్న ఆరోపణలపై విచారణ ఎదుర్కొంటున్న దేవదాయశాఖ అదనపు కమిషనర్ కె.రామచంద్రమోహన్‌ను కాపాడేందుకు ప్రస్తుత ప్రభుత్వ పెద్దలు పావులు కదుపుతున్నట్లు తెలిసింది. ఈ వ్యవహారంపై గతంలోనే విచారించి ప్రభుత్వానికి నివేదిక సమర్పించిన అధికారులు.. ఇప్పుడు తమ ముందు హాజరుకావాలని విజిలెన్స్ లేఖ రాయడం అనేక అనుమానాలను దారి తీస్తోంది. ఇప్పటికే అధికారులు అందించిన నివేదిక ప్రభుత్వం వద్దే ఉన్నప్పటికీ.. మళ్లీ దానిపై ప్రత్యేకంగా వివరాలు తెలుసుకోవాలనుకోవడం వెనుక ఆంతర్యం ఏమిటన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ప్రస్తుతం అన్నవరం కార్యనిర్వహణాధికారి(ఈవో)గా దేవదాయ శాఖ అడిషనల్ కమిషనర్ రామచంద్రమోహన్ విధులు నిర్వర్తిస్తున్నారు. 2007–2008లో విశాఖలో డిప్యూటీ కమిషనర్‌గా ఉంటూ సింహాచలం ఇన్‌చార్జి ఈవోగా వ్యవహరించారు. మళ్లీ 2013 మార్చి నుంచి 2019 ఆగస్టు వరకు ఆరేళ్ల పాటు సింహాచలం ఈవోగా విధులు నిర్వర్తించారు.

భూముల అన్యాక్రాంతంపై ఆరోపణలు

2016 డిసెంబర్ నుంచి 2017 ఫిబ్రవరి మధ్య సింహాచలం దేవస్థానానికి చెందిన 862 ఎకరాల భూములను రిజిస్టర్ నుంచి తొలగించారని రామచంద్రమోహన్‌పై ఆరోపణలు వెల్లువెత్తాయి. అలాగే మాన్సాస్ భూముల విషయంలో కూడా అక్రమాలు జరిగినట్లు వార్తలు వినిపించాయి. దీనిపై గత ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ఇందుకోసం అసిస్టెంట్ అడిషనల్ కమిషనర్ టి.చంద్రకుమార్, జాయింట్ కమిషనర్ డి.భ్రమరాంబ, డిప్యూటీ కమిషనర్(వీఆర్) ఈ.వి.పుష్పవర్ధన్‌లతో కమిటీని నియమించింది. ఈ ఆరోపణలపై కమిటీ విచారించి 2021 జూలై 16న ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. రామచంద్రమోహన్ అధికార దుర్వినియోగానికి పాల్పడినట్లు తేల్చింది. దీంతో గత ప్రభుత్వం అతనిపై సస్పెన్షన్ వేటు వేయడంతో పాటు పూర్తిస్థాయి వాస్తవాల కోసం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. ఆ తర్వాత రామచంద్రమోహన్ కోర్టుకు వెళ్లి తిరిగి పోస్టింగ్ తెచ్చుకున్నారు.

విచారణాధికారులను పిలిచిన విజిలెన్స్

కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఐదు నెలల తర్వాత విజిలెన్స్ అధికారులు ఇప్పుడు రాసిన 'లేఖ' అనేక సందేహాలకు తావిస్తోంది. ఆరోపణలపై సందేహాల నివృత్తి పేరుతో గతంలో ప్రభుత్వానికి నివేదిక సమర్పించిన విచారణాధికారులను ప్రశ్నించాలని నిర్ణయించారు. ఇందు కోసం ఈ నెల 22లోగా అసిస్టెంట్ అడిషనల్ కమిషనర్ టి.చంద్రకుమార్, జాయింట్ కమిషనర్ డి.భ్రమరాంబ, డిప్యూటీ కమిషనర్(వీఆర్) ఈ.వి.పుష్పవర్ధన్‌లు తమ ముందు హాజరుకావాలని దేవదాయ శాఖ కమిషనర్‌కు లేఖ రాశారు. ఈ నిర్ణయం వెనుక ప్రస్తుత ప్రభుత్వ పెద్దల హస్తం ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సింహాచలం భూముల అక్రమాలను పక్కనపెట్టి.. ఈవో రామచంద్రమోహన్‌ను కాపాడేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది.

సెయిల్‌లో విలీనంపై 23న రౌండ్ టేబుల్ సమావేశం

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలన్న డిమాండ్‌పై ఈనెల 23న ఉమ్మడి విశాఖ జిల్లాలోని అన్ని రాజకీయ పార్టీల అధ్యక్షులు, ఎమ్మెల్యేలు, ఎంపీలతో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేయాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నిర్ణయించింది. మంగళవారం రాత్రి జరిగిన పోరాట కమిటీ సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు ఈనెల 24న స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలో కొనసాగించాలని పాత గాజువాక నుంచి కొత్త గాజువాక వరకు పాదయాత్ర నిర్వహించి అక్కడ బహిరంగ సభ ఏర్పాటు చేయనున్నారు. 27న సెయిల్‌లో విలీనం అనే అంశంపై ఉత్తరాంధ్ర మేధావులతో విశాఖలో సమావేశం ఏర్పాటు చేయనున్నారు. ప్రధాని నరేంద్ర మోడీ విశాఖ వస్తున్న నేపథ్యంలో ఈనెల 28న ఉదయం 8 నుంచి 29 రాత్రి 6 గంటల వరకు నిరాహార దీక్ష చేయాలని నిర్ణయించారు. సమావేశంలో పోరాట కమిటీ నాయకులు మంత్రి రాజశేఖర్, డి.ఆదినారాయణ, కె.ఎస్.ఎన్. రావు, జె.అయోధ్యరామ్, యు.రామస్వామి, రామ్మోహన్‌కుమార్, లక్ష్మణరావు, సన్యాసిరావు, రామ్‌కుమార్, వరసాల శ్రీనివాసరావు, బి.డేవిడ్, పల్లా పెంటారావు పాల్గొన్నారు.

అత్యాచార నిందితులను శిక్షించాలి

ఎస్‌ఎఫ్‌ఐ డిమాండ్

మద్దిలపాలెం : విద్యార్థినిపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్‌ఎఫ్‌ఐ) జిల్లా కార్యదర్శి ఎల్‌జే నాయుడు ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రేమ పేరుతో విద్యార్థినితో సన్నిహితంగా ఉన్న యువకుడు అతడి నలుగురు స్నేహితులు ఆమె ఫొటోలు, వీడియోలు చిత్రీకరించి ఆ పై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారని వాపోయారు. ప్రశాంతమైన విశాఖ నగరంలో నిత్యం ఇటువంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వీటికి అడ్డుకట్ట వేయడంలో పోలీసులు విఫలమవుతున్నారని ఆక్షేపించారు. రాష్ట్ర హోం మంత్రి అనిత ఇలాకాలో ఇటువంటి ఘటనలు చోటుచేసుకుంటున్నా.. ఆమె పట్టనట్లు ఉండటం సరికాదన్నారు.

నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి

సీతమ్మధార : ప్రేమ పేరుతో విద్యార్థిన్ని మోసం చేసిన ప్రేమోన్మాదితో పాటు సామూహిక అత్యాచారానికి పాల్పడిన అతని నలుగురు స్నేహితులను కఠినంగా శిక్షించాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రాష్ట్రంలో హత్యలు, అత్యాచారాలు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర హోం శాఖ మంత్రి అనిత ఇలాకాలో ఇటువంటి దారుణ ఘటనలు జరగడం బాధాకరమన్నారు. సైబర్ నేరాలు అరికట్టడంలోను, మహిళలకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. సోషల్ మీడియాలో పోస్టులు అంటూ ప్రతిపక్ష పార్టీల నాయకులపై కేసులు పెట్టే శ్రద్ధ.. మహిళల రక్షణపై పెడితే ఇటువంటి ఘటనలు చోటుచేసుకోవన్నారు. విద్యార్థిని కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు.

అపోహలు వీడి.. అవయవదానానికి..



అవయవదానానికి అంగీకరిస్తున్నట్లు సంతకాలు చేసిన ధ్రువీకరణ పత్రాలతో పాఠశాల సిబ్బంది

పెందుర్తి: అన్నిదానాల్లో ప్రాణదానం గొప్పది. అందుకు ఉన్న మార్గాల్లో అత్యంత విలువైనది అవయవదానం. అవయాలను దానం చేస్తే.. మరణించాక కూడా మరోసారి జీవించినట్లే. స్థానిక సాయి హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అవయదానం కార్యక్రమానికి పెందుర్తి యూనిక్ పాఠశాల సిబ్బంది ముందుకొచ్చారు. పాఠశాల ప్రిన్సిపాల్ కోనేటి ఆదినారాయణ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయనతో పాటు 11 మంది సహచర సిబ్బంది అవయదానం చేసేందుకు అంగీకరించారు. సంబంధిత ధ్రువీకరణ పత్రాలను స్థానిక కార్పొరేటర్ పీలా శ్రీనివాసరావు చేతుల మీదుగా ట్రస్టు సభ్యులకు మంగళవారం అందించారు. కార్యక్రమంలో యూనిక్ స్కూల్ ఉపాధ్యాయులు, చారిటబుల్ ట్రస్ట్ సభ్యుడు కందుల నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ చదువు.. భవితకు వెలుగు

- ఏయూలో డిస్టెన్స్ కోర్సులకు ఆదరణ
- రాష్ట్రంలో ఆన్‌లైన్ విధానం ప్రవేశపెట్టిన తొలి వర్సిటీ
- ఇంట్లో నుంచే పరీక్షలు రాసే అవకాశం
- విదేశీ విద్యార్థులు సైతం చేరిక



ఏయూలోని దూర విద్యాకేంద్ర కార్యాలయం



పర్యవేక్షణ చేస్తున్న సాంకేతిక విభాగం

విశాఖ విద్య: ఆంధ్రా యూనివర్సిటీలో చదువుల ట్రెండ్ మారుతోంది. స్కూల్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ విభాగం ద్వారా మూడేళ్ల కిందట అందుబాటులోకి వచ్చిన ఆన్‌లైన్ డిగ్రీ, పీజీ కోర్సులకు విద్యార్థుల నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. ఉపాధి, ఉద్యోగ రంగాల్లో నిలదొక్కుకొన్న యువత ఆన్‌లైన్ కోర్సుల వైపు మొగ్గుచూపుతున్నారు. ఒకవైపు ఉద్యోగాలు చేస్తూనే ఆన్‌లైన్ ద్వారా డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సులు పూర్తి చేసి.. తమ భవిష్యత్‌కు పటిష్టమైన పునాదులు వేసుకుంటున్నారు. డిస్టెన్స్, ఆన్‌లైన్ కోర్సులకు విద్యార్థుల నుంచి లభిస్తున్న ఆదరణతో 2024–25 విద్యా సంవత్సరం అడ్మిషన్లపై వర్సిటీ అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. షెడ్యూల్ మేరకు ఈ నెల 15తో తొలి విడత అడ్మిషన్ల గడువు ముగిసినందున తరగతుల నిర్వహణపై స్టడీ సెంటర్ల నిర్వాహకులను అధికారులు అప్రమత్తం చేశారు. డిసెంబర్‌లో మరో విడత ప్రవేశాల నిర్వహణకు సిద్ధమవుతున్నారు.

రాష్ట్రంలో తొలి వర్సిటీ ఇదే..

వర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించే స్కూల్ ఆఫ్‌డిస్టెన్స్ ఎడ్యుకేషన్ విభాగం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 115 అధ్యయన కేంద్రాలు ఉన్నాయి. వీటి ద్వారా డిగ్రీ, పీజీ, డిప్లమో వంటి 33 రకాల కోర్సుల్లో ఏటా 20 వేలకు పైగా విద్యార్థులు ప్రవేశాలు పొందుతున్నారు. సాంకేతికత కొత్తపుంతలు తొక్కుతున్న నేపథ్యంలో ఏయూ అధికారులు మరో అడుగు ముందుకేశారు. 2021–22 విద్యా సంవత్సరం నుంచి ఆన్‌లైన్ విధానంలో కూడా డిగ్రీ, పీజీ కోర్సులను అందుబాటులోకి తీసుకొచ్చారు.

ఆన్‌లైన్ కోర్సులకు క్రేజ్

వర్సిటీలో నిర్వహిస్తున్న ఆన్‌లైన్ కోర్సులకు ఏడాదికేడాది చేరే విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. తొలి ఏడాది రెండు కోర్సులను మాత్రమే నిర్వహించగా, 41 మంది విద్యార్థులు చేరారు. క్యాలెండర్ ఇయర్, అకడమిక్ ఇయర్ పేరుతో ఏటా రెండు సార్లు ప్రవేశాల కోసమని నోటిఫికేషన్ ఇస్తున్నారు. 2022–23లో 12 కోర్సులకు 365 మంది, 2023–24లో 9,932 మంది చేరగా, వీరిలో ఎంబీఏ కోర్సు వారే 4,135 మంది ఉండటం గమనార్హం. కాగా వర్సిటీపై ఉన్న క్రేజ్‌తో విదేశాల నుంచి కూడా విద్యార్థులు ఆన్‌లైన్ కోర్సుల్లో చేరుతున్నారు. ఇలా ఇప్పటి వరకు వంద మంది విదేశీయులు కోర్సుల్లో చేరినట్లు వర్సిటీ అధికారులు తెలిపారు. ఈ మొత్తం పరిణామాలతో ఈ ఏడాది అడ్మిషన్లు సంఖ్య బాగా పెరుగుతోందని వర్సిటీ అధికారులు భావిస్తున్నారు.

చదువు.. ఉపాధి

ఆన్‌లైన్ డిగ్రీ, పీజీ కోర్సులు చదివే విద్యార్థులకు ఉపాధి కల్పించేలా వర్సిటీ అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు. కోర్సుల నిర్వహణ బాధ్యతలు చూసే సాంకేతిక విభాగం ఇందుకోసమని ఏపీ, తెలంగాణ, కర్నాటక తదితర రాష్ట్రాల్లోని కొన్ని కార్పొరేట్ సంస్థలతో ముందస్తు ఒప్పందం చేసుకుంది. ఆన్‌లైన్ కోర్సు ఫీజుకు అదనంగా అప్రెంటీస్‌షిప్ పేరుతో రూ.3వేలు చెల్లించిన వారికి ఉద్యోగ అవకాశాలను చూపిస్తున్నారు. ఇలా ఈ మూడేళ్ల కాలంలో 45 మందికి ఉపాధి కల్పించారు.

ఇంట్లో నుంచే పరీక్షలు రాసే అవకాశం

ఆన్‌లైన్ కోర్సులు అభ్యసించే విద్యార్థులు వార్షిక పరీక్షలను ఇంట్లో నుంచే రాయవచ్చు. షెడ్యూల్ మేరకు ఆన్‌లైన్‌లో పాఠ్యాంశాలు వినాలి. వార్షిక పరీక్షల్లో థియరీకి 70, ఇంటర్నల్స్‌కు 30మార్కులు ఉంటాయి. ఆన్‌లైన్‌లో పాఠ్యాంశాల బోధనకు ఫ్యాకల్టీని నియమించారు. వార్షిక పరీక్షలను సీసీ కెమెరాలో రికార్డు అయ్యే విధంగా విద్యార్థి ఇంట్లో, లేదా కంప్యూటర్ అందుబాటులో ఉన్న ఎక్కడ నుంచైనా పరీక్ష రాయవచ్చు. అడ్మిషన్ తీసుకునే మొదలు కోర్సు పూర్తయ్యేంత వరకు విద్యార్థి ఆన్‌లైన్ చదువుల తీరును సమగ్ర పరిశీలన చేసేందుకు వర్సిటీలో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేశారు.

బోధనపై ప్రత్యేక దృష్టి



ఆంధ్రా యూనివర్సిటీ దూర విద్యా కేంద్రం ద్వారా నిర్వహించే కోర్సుల్లో ప్రవేశాలు పెంచేందుకు ప్రత్యేక దృష్టి సారించాం. స్టడీ సెంటర్లపై కూడా పర్యవేక్షణ పెంచేలా కార్యాచరణ సిద్ధం చేశాం. రెగ్యులర్ కోర్సులతో సమానమైన గుర్తింపు ఉన్నందున.. పాఠ్యాంశాల బోధన కూడా సవ్యంగా సాగేలా శ్రద్ధ తీసుకుంటున్నాం.

–ఆచార్య ఎస్.విజయ్ మోహన్,
ఏయు దూరవిద్య డైరెక్టర్

రైళ్లకు కొత్త నంబర్లు

తాటిచెట్లపాలెం: ఈస్ట్‌కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ పరిధిలో నడిచే పలు రైళ్ల నంబర్లు మార్పులు చేసినట్లు సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ ఓ ప్రకటనలో తెలిపారు. కింద పేర్కొన్న రైళ్లు 2025 జనవరి 1 నుంచి మారిన నంబర్లతో నడుస్తాయని, ప్రయాణికులు ఈ మార్పును గమనించాలని సూచించారు.

రైలు	ప్రస్తుత నంబర్	కొత్త నంబర్
కటక్–గుణుపూర్ మెము	08421	68433
గుణుపూర్–కటక్ మెము	08422	68434
విశాఖపట్నం–కిరండూల్ పాసింజర్	08551	58501
కిరండూల్–విశాఖపట్నం పాసింజర్	08552	58502
విశాఖపట్నం–రాయ్‌పూర్ పాసింజర్	08528	58528
రాయ్‌పూర్–విశాఖపట్నం పాసింజర్	08527	58527
విశాఖపట్నం–కోరాపుట్ పాసింజర్	08546	58538
కోరాపుట్ –విశాఖపట్నం పాసింజర్	08545	58537
విశాఖపట్నం–బ్రహ్మపూర్ పాసింజర్	08531	58532
బ్రహ్మపూర్–విశాఖపట్నం పాసింజర్	08532	58531
విశాఖపట్నం–గుణుపూర్ పాసిజంర్	08522	58506
గుణుపూర్–విశాఖపట్నం పాసింజర్	08521	58505
విశాఖపట్నం–భవానిపట్న పాసింజర్	08504	58504
భవానిపట్న–విశాఖపట్నం పాసింజర్	08503	58503

కింద పేర్కొన్న రైళ్లు 2025 మార్చి నుంచి మారిన నంబర్లతో నడుస్తాయి

రైలు	ప్రస్తుత నంబర్	కొత్త నంబర్
విశాఖపట్నం–కడప తిరుమల ఎక్స్‌ప్రెస్	17488	18521
కడప–విశాఖపట్నం తిరుమల ఎక్స్‌ప్రెస్	17487	18522
విశాఖపట్నం– గుంటూరు ఉదయ్ ఎక్స్‌ప్రెస్	22701	22875
గుంటూరు –విశాఖపట్నం ఉదయ్ ఎక్స్‌ప్రెస్	22702	22876
భువనేశ్వర్ – రామేశ్వరం ఎక్స్‌ప్రెస్	20896	20895
రామేశ్వరం – భువనేశ్వర్ ఎక్స్‌ప్రెస్	20895	20896
భువనేశ్వర్ – పుదుచ్చేరి ఎక్స్‌ప్రెస్	12898	12897
పుదుచ్చేరి – భువనేశ్వర్ ఎక్స్‌ప్రెస్	12897	12898
భువనేశ్వర్– చెన్నై సెంట్రల్ ఎక్స్‌ప్రెస్	12830	12829
చెన్నై సెంట్రల్ –భువనేశ్వర్ ఎక్స్‌ప్రెస్	12829	12830

సృజన వెలికితీసేందుకే బాలోత్సవ్

డాబాగార్డెన్స్: మహారాణిపేటలోని సెయింట్ ఆంథోనీ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విశాఖ బాలోత్సవం వేడుకగా ప్రారంభమైంది. విశాఖ బాలోత్సవం అధ్యక్షుడు పిల్లల మర్రి రఘు అధ్యక్షతన కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత బేతవోలు రామబ్రహ్మం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. విశాఖ బాలోత్సవం చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. పిల్లలను ప్రోత్సహించేందుకు ఇటువంటి వేదికలను ఉపయోగించుకోవాలని స్కూల్ యాజమాన్యాలు, తల్లిదండ్రులకు సూచించారు. మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ మాట్లాడుతూ పిల్లలు దేనినైనా సూక్ష్మంగా గ్రహిస్తారన్నారు. పిల్లలు ఎలా ఉండాలో దేవతలు, రాక్షసుల కథ ద్వారా వివరించారు. కన్సర్న్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ పీకే జోష్ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో పిల్లలకు ఇటువంటి కార్యక్రమాలు చాలా అవసరమన్నారు. పాఠశాల కరస్పాండెంట్ ఫాదర్ రత్నకుమార్ మాట్లాడుతూ విశాఖలోని బాలలను ఒకే వేదికపైకి తీసుకొచ్చి ఇన్ని ఈవెంట్స్ నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. కార్యదర్శి జీఎస్ రాజేశ్వరరావు, ఉపాధ్యక్షురాలు కె.రమాప్రభ మాట్లాడుతూ రెండు నెలలుగా ఈ కార్యక్రమం కోసం కృషి చేయగా 120 పాఠశాలల నుంచి దాదాపుగా 8 వేల మంది విద్యార్థులు పేర్లు నమోదు చేసుకున్నారని తెలిపారు. మూడు రోజుల పాటు 84 సాంస్కృతిక, ఈవెంట్స్ ఉంటాయని, తొలి రోజు 27 ఈవెంట్స్ నిర్వహించామన్నారు. 100 మంది న్యాయ నిర్ణేతలుగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో బాల వికాస్ ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి నరవ ప్రకాశరావు, ఆసరా చారిటబుల్ సొసైటీ ప్రతినిధి శ్రీనాథ్, ఆహ్వాన సంఘం సభ్యురాలు కె సుశీల, వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ ప్రతినిధి వై.మోదాంబికా దేవి, ఎం.ఎల్లాజీ, ఎం.గుణశంకర్, వై.సత్యనారాయణ, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ బాలోత్సవంలో వక్తలు



మాట్లాడుతున్న కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత బేతవోలు రామబ్రహ్మం



పోటీలో పాల్గొన్న వివిధ పాఠశాలల చిన్నారులు



బొమ్మలు గీస్తున్న చిన్నారులు

క్రీడల్లో ఐఐఎంవీ విద్యార్థుల సత్తా



పోటీల్లో పాల్గొన్న విశాఖ ఐఐఎం విద్యార్థులు

విశాఖ విద్య: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం) సంస్థల ఆధ్వర్యంలో బెంగళూరు ఐఐఎం వేదికగా ఈ నెల 15 నుంచి మూడు రోజుల పాటు జరిగిన స్పోర్ట్స్ టోర్నమెంట్‌లో విశాఖ విద్యార్థులు సత్తా చాటారు. పలు క్రీడల్లో ప్రతిభ చూపి ఓవరాల్‌గా నాలుగో స్థానం సొంతం చేసుకున్నారు. ఐఐఎం విశాఖపట్నం నుంచి 196 మంది పాల్గొనగా.. ఐఐఎం బెంగళూరు, ఐఐఎం కోజికోడ్, ఐఐఎం తిరుచిరాపల్లి, ఐఐఎం షిల్లాంగ్, ఐఐఎం నాగ్‌పూర్ వంటి విద్యా సంస్థల క్రీడాకారులు పోటీపడ్డారు. మూడు రోజుల పాటు 27 క్రీడా విభాగాల్లో పోటీలు జరగ్గా.. ఐఐఎంవీ విద్యార్థులు 12 పతకాలు సాధించి అందరినీ ఆకట్టుకున్నారు. టేబుల్ టెన్నిస్(మహిళలు), ఫుట్సల్‌లో బంగారు పతకాలు, క్రికెట్, క్యారమ్స్, త్రోబాల్, ఫ్రిస్బీ, పూల్ (పురుషులు), పూల్(మహిళలు)లో రజతాలు, వాలీబాల్ (మహిళలు), టేబుల్ టెన్నిస్(పురుషులు), స్క్వాష్(మిశ్రమ), ఫుట్‌బాల్ (పురుషులు)లో కాంస్య పతకాలు సాధించారు. ఇదే స్ఫూర్తిని రానున్న రోజుల్లోనూ కొనసాగించాలని ఆకాంక్షిస్తూ.. ఐఐఎం ప్రతినిధులు విద్యార్థులను అభినందించారు.

మాకు బతుకే లేకుండా చేశావు కదయ్యా

కార్పొరేటర్ మూర్తి యాదవ్‌ను ముట్టడించిన చిరు వ్యాపారులు




మూర్తి యాదవ్‌ను ముట్టడించిన చిరు వ్యాపారులు

బీచ్‌రోడ్డు: తమ షాపులను అన్యాయంగా తొలగించారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. జీవీఎంసీ 22వ వార్డు కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్‌ను మంగళవారం చిరు వ్యాపారులు, స్థానికులు చుట్టుముట్టి నిలదీశారు. 30 ఏళ్లుగా చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని, దుకాణాలు ధ్వంసం చేయించి ఎందుకు తమ పొట్ట కొట్టారని ఆయన్ని ప్రశ్నించారు. మీరు కార్పొరేటర్ అయితే మా బతుకులు బాగుంటాయని ఆశ పడితే, మాకు బతుకే లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు మేము ఎలా బతకాలి? మా కుటుంబాలను ఎవరు పోషిస్తారు? మా అప్పులు ఎవరు తీరుస్తారని మూర్తిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చిరు వ్యాపారాలకు మద్దతుగా స్థానికులు కూడా కార్పొరేటర్‌ను ప్రశ్నించారు. తమకు న్యాయం జరిగే వరకు నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తామని చిరు వ్యాపారులు మూర్తి యాదవ్‌కు స్పష్టం చేశారు.

'క్యాన్సర్ సర్వేను సకాలంలో పూర్తి చేయాలి'

మహారాణిపేట: జిల్లాలో క్యాన్సర్ సర్వేను సకాలంలో పూర్తి చేసి, అభ ఐడీ, మాతా శిశు సంక్షేమ ఆరోగ్య సేవలను పటిష్టంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేందిర ప్రసాద్ సూచించారు. సూర్యబాగ్ జీవీఎంసి జోనల్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం జిల్లాలోని ప్రాథమిక పట్టణ ఆరోగ్య కేంద్రాల వైద్యులతో సమీక్ష, శిక్షణ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ క్యాన్సర్ సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. గర్భిణుల రిజిస్ట్రేషన్ గురించి ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు మాట్లాడుతూ మాతా శిశువు ఆరోగ్య సేవల్లో భాగంగా మాతా, శిశు మరణాలు సంభవించకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అపోలో క్యాన్సర్ ఇనిస్టిట్యూట్(హైదరాబాద్) డాక్టర్ శ్రీలక్ష్మి, కేజీహెచ్ డాక్టర్ సంధ్యాదేవి, వీజీహెచ్ డాక్టర్ ఉషా ప్రసాద్, మనోజ్(హైదరాబాద్) ఆధ్వర్యంలో జిల్లాలోని వైద్యులకు, వైద్యాధికారులకు శిక్షణ ఇచ్చారు.

నీటి సదుపాయం ఉన్న ప్రతి చోటా డ్రిప్ ఇరిగేషన్



ఉద్యాన ప్రగతిపై సమీక్షిస్తున్న రాష్ట్ర ఉద్యానశాఖ కమిషనర్ శ్రీనివాసులు

మహారాణిపేట: నీటి సదుపాయం ఉన్న ప్రతి చోటా డ్రిప్ ఇరిగేషన్ పనులు చేపట్టాలని రాష్ట్ర ఉద్యానశాఖ కమిషనర్ డాక్టర్ కె. శ్రీనివాసులు ఆదేశించారు. బీచ్‌రోడ్డులోని ఓ హోటల్‌లో ఉత్తరాంధ్రలో 2024–25 సంవత్సరపు ఉద్యాన ప్రగతిపై మంగళవారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రభుత్వ ఆకాంక్ష ప్రకారం 15 శాతం వృద్ధి సాధించాలన్నారు. ముఖ్యంగా ఆయిల్ పామ్, కూరగాయలు, జామ లాంటి లాభసాటి పంటలు విస్తీర్ణాన్ని, దిగుబడిని పెంచాలని ఆదేశించారు. ఉద్యాన అదనపు సంచాలకుడు కె.బాలాజీ నాయక్, సీబీ హరినాథ రెడ్డి, ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎం.వెంకటేశ్వర్లు, జిల్లా ఉద్యాన అధికారులు సత్యనారాయణరెడ్డి(విశాఖ), ఏవీఎస్ జమదగ్ని(శ్రీకాకుళం), ఆర్.వి.ఎస్.ప్రసాద్(శ్రీకాకుళం), జి.ప్రభాకరరావు(అనకాపల్లి), ఎ.రమేష్‌బాబు(అల్లూరి), ఎ.ఎస్.వర ప్రసాద్(పార్వతీపురం మన్యం జిల్లా), ప్రాజెక్ట్ డైరెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.

ఎస్సీ సబ్ ప్లాన్‌కు కేటాయింపులు తగ్గాయి

యూపీఎస్సీ పూర్వ సభ్యుడు ఆచార్య కె.ఎస్.చలం

విశాఖ సిటీ: రాష్ట్ర బడ్జెట్ గందరగోళంగా ఉందని యూపీఎస్సీ పూర్వ సభ్యుడు ఆచార్య కె.ఎస్.చలం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రూ.2.9 లక్షల కోట్ల బడ్జెట్‌లో జనాభా ప్రకారం 16 శాతం ఉన్న ఎస్సీలకు రూ.46 వేల కోట్లు కేటాయించాల్సి ఉందని గుర్తు చేవారు. కానీ రూ.18 వేల కోట్లు మాత్రమే కేటాయించడం సమంజసం కాదన్నారు. ఎస్సీ జనాభా 16 శాతం ఉన్నట్లు అంగీకరించకపోయినప్పటికీ.. కనీసం 15 శాతం అయినా ఉంటుందని దాని ప్రకారం కూడా బడ్జెట్ లేకపోవడం దారుణ మన్నారు. రాష్ట్రంలో దళిత శాసన సభ్యులు 15 మంది ఉన్నారని, అలాగే చాలా అంబేద్కర్ సంఘాలు ఉన్నాయని తెలిపారు. వీరు ఈ అధ్యయనం చేసి కోర్కెలను ప్రభుత్వానికి తెలియజేస్తే బడ్జెట్‌లో ప్రవేశపెట్టడానికి అవకాశం ఉంటుందన్నారు.

ఉత్సాహంగా యువజనోత్సవ పోటీలు



మాట్లాడుతున్న జేసీ అశోక్ మయూర్



మహంకాళి నృత్య ప్రదర్శనలో విద్యార్థులు

డాబాగార్డెన్స్: జాతీయ స్థాయి యువజనోత్సవాల ఎంపిక పోటీలు మంగళవారం స్థానిక ఏవీఎన్ కళాశాలలో నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ అశోక్ మయూర్ యువజనోత్సవాల పోటీలు ప్రారంభించి మాట్లాడారు. యువత యువజనోత్సవాల్లో పాల్గొని వారిలో నిబిడీకృతమైన కళలను బయటకు తీసుకురావల్సిన అవసరం ఉందన్నారు. నెహ్రూ యువ కేంద్రం జిల్లా యువ అధికారి జి.మహేశ్వరరావు మాట్లాడుతూ సాంస్కృతిక పోటీలు(జానపద కళా రూపాలు), వ్యక్తిత్వ పోటీలు, ఫొటోగ్రఫీ, చిత్రలేఖన పోటీలు నిర్వహించినట్టు చెప్పారు. హైస్కూల్ విద్యార్థులతో సైంటిఫిక్ ఎగ్జిబిషన్ కూడా నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారి సహకారంతో వివిధ స్కూళ్ల విద్యార్థుల ద్వారా వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఏవీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సింహాద్రినాయుడు, హెచ్‌పీసీఎల్ పూర్వ మానవ వనరుల అధికారి డాక్టర్ కె.రాజశేఖర్, డాక్టర్ సింహాచల నాయుడు, ఎన్ఎస్ఎస్ రాష్ట్రపతి అవార్డు గ్రహీత ఆర్.లీలాప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


అవమానభారంతో యువకుడి ఆత్మహత్య



మనోజ్‌ప్రీతం(ఫైల్)

పెందుర్తి: స్నేహితులు ఇంటిపైకి వచ్చి గొడవ చేశారన్న కారణంగా ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మేహాద్రి గెడ్డ రిజర్వాయర్‌లో జరిగిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి.. పోలీసుల కథనం ప్రకారం.. పురుషోత్తపురంలో నివాసం ఉంటున్న సబ్బితి సూర్యనారాయణ, సునీత దంపతుల కుమారుడు మనోజ్ ప్రీతం(19) స్నేహితులతో తిరుగుతుండేవాడు. మనోజ్ అవసరం నిమిత్తం వారి వద్ద నగదు చేబదులుగా తీసుకునేవాడు. ఆ నగదు తిరిగి ఇవ్వడంలో జాప్యం జరగడంతో వారంతా ఈ నెల 17న పురుషోత్తపురంలో మనోజ్ ఇంటికి వెళ్లి గొడవ చేశారు. దీంతో తీవ్ర అవమానానికి గురైన మనోజ్ తన బైక్‌పై వెళ్లి మేహాద్రి గెడ్డలో దూకేశాడు. అయితే విషయం తెలియని తల్లి సునీత తన కుమారుడు కనిపించడం లేదని సోమవారం పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో మేహాద్రి గెడ్డ రిజర్వాయర్‌లో బుధవారం యువకుడి మృతదేహం కనిపించడంతో మనోజ్ కుటుంబ సభ్యులకు పోలీసులు సమాచారం ఇచ్చారు. తన కుమారుడి మృతికి తమ ఇంటిపైకి వచ్చి గొడవ చేసిన వారే కారణమని మనోజ్ తల్లి ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఆ దిశగా దర్యాప్తు చేపట్టారు. మంగళవారం సాయంత్రం ఐదుగురు యువకులను పోలీసులు అదుపులోని తీసుకుని విచారిస్తున్నట్లు తెలుస్తోంది. సీఐ కె.వి.సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు జరుగుతుంది.

కెనరా బ్యాంక్ ఉద్యోగుల రక్తదానం



రక్తదానం చేస్తున్న బ్యాంకు సిబ్బంది

బీచ్‌రోడ్డు: కెనరా బ్యాంక్ వ్యవస్థాపకుడు అమ్మెంబాల్ సుబ్బారావు పై 119వ జయంతి సందర్భంగా మంగళవారం రీజినల్ కార్యాలయంలో ఉద్యోగులు రక్తదానం చేశారు. రెడ్ క్రాస్ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని రీజినల్ హెడ్ మధుసూదనరెడ్డి ప్రారంభించారు. డివిజనల్ మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.